సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
శనివారం, మే 04, 2024
డిజిటల్



# రాముడి పేరుతో బండి రాజకీయం

2 లో..

- పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'కారు' గ్యారేజ్‌కి పోయింది ఇక రాదు
- బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం
- సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ జన జాతర బహిరంగ సభ
- భారీగా తరలివచ్చిన ప్రజలు

కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ రాముడి పేరుతో రాజకీయం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లోక్ సభ ఎన్నికల జన జాతర బహిరంగ సభను నిర్వహించారు. సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై మండిపడ్డారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ నాయకులు బండి సంజయ్ ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు.

- తెలంగాణ ప్రభ (సిరిసిల్ల బ్యూరో)

# వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరా

### కరీంనగర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ.గంగాధర్

తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) : వేసవిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుకూలంగా విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని శుక్రవారం కరీంనగర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ.గంగాధర్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో 33/11 కేవీ చంద్రంపేట సబ్ స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో భాగంగా జిల్లాలోని 33 కేవీ చంద్రంపేట సబ్ స్టేషన్ తనిఖీ చేశారు. ఫిడర్స్ ఇన్ స్పెక్షన్ చేయాలని ఏడీఈ, ఏఈని ఆదేశించారు. 11 కేవీ ఫిడర్స్ అంతరాయాల గురించి సెస్ ఎండీని కలవడం కలిశారు. 11 కేవీ ఫీడర్‌లో లోపాలని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ ఆపరేషన్ కరీంనగర్ రాజం, ఏడీఈ, సీఅండ్ఓ ప్రదీప్, ఏఈలు ఉన్నారు.





## ఐదు నెలల్లోనే రేవంత్‌రెడ్డి అవినీతి మార్క్ పాలన చూపిస్తున్నారు : కిషన్‌రెడ్డి

తెలంగాణ ప్రభ, హైదరాబాద్ : ఐదు నెలల్లోనే రేవంత్ రెడ్డి అవినీతి మార్క్ పాలనను చూపిస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణలో మార్పు వచ్చిందని చెబుతున్న ముఖ్యమంత్రి... ఏం మార్పు వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణలో కేవలం కల్వకుంట్ల కుటుంబ పాలన పోయి సోనియా గాంధీ కుటుంబ పాలన వచ్చిందని విమర్శించారు. ఇదేనా వచ్చిన మార్పు? అని నిలదీశారు. రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ఇప్పుడు గాడిద గుడ్డు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హోర్డింగ్స్ కూడా పెట్టారని... కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ఆరింట ఐదు గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని... కానీ ఎక్కడ చేశారని ప్రశ్నించారు. జర్నలిస్టులకు, హోంగార్డులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారా? అని ప్రశ్నించారు. రైల్వేలపై మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.

# రాముడి పేరుతో బండి రాజకీయం

## పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


- 'కారు' గ్యారేజ్‌కి పోయింది ఇక రాదు
- బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందం
- సిరిసిల్లలో కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభ
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, నాయకులు



**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల బ్యూరో) :** కరీంనగర్ ఎంపీగా పోటీ చేస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ రాముడి పేరుతో రాజకీయం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో లోక్ సభ ఎన్నికల జన జాతర బహిరంగ సభను నిర్వహించారు. సభకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీపై మండిపడ్డారు. రాముడి పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీ నాయకులు బండి సంజయ్ ప్రజల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు శుభం కలగాలంటే శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ, పట్టాభిషేకం, కల్యాణం తర్వాత అక్షంతలు ఇస్తే బాగుండేదన్నారు. గత ఎన్నికల్లోను మతాన్ని అడ్డం పెట్టుకొని గెలిచారని మళ్లీ మతాన్ని అడ్డం పెట్టుకొని మోడీ అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు వినోద్‌కుమార్, బండి సంజయ్ ఎంపీలుగా ప్రజలకు ఏం చేశారు చెప్పాలని ప్రశ్నించారు. గతంలో ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి తిరుపతికి రైలు, కరీంనగర్ పాస్ పోర్ట్ కేంద్రం, సిరిసిల్ల వేములవాడకు కార్మిక ఆస్పత్రులు వచ్చాయన్నారు. సిరిసిల్లకు వచ్చే టెక్స్‌టైల్ జోన్ వరంగల్ పోవడానికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కారణం కాదా? అని నిలదీశారు.

కేంద్ర పర్యటక శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నుంచి కొండగట్టు అంజన్న ఆలయానికి ప్రసాద పథకం ద్వారా నయా పైసా తేలేదని మండిపడ్డారు. పదేళ్లలో బీఆర్ఎస్ సిరిసిల్ల ధార్మిక కార్మిక క్షేత్రంలో సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాజన్న ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తామని బీఆర్ఎస్ నాయకులు ఇవ్వలేదన్నారు. ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పరిష్కరించని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అప్పర్ మానేరు ప్యాకేజీ 9 ఎందుకు పూర్తి కాలేదని కేటీఆర్‌ను ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. విభజన హామీలు అమలు చేయని బీజేపీని, 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రశ్నించ లేక పోయిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలని రేవంత్ పిలుపునిచ్చారు.

సభలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్ చార్జి కేకే మహేందర్‌రెడ్డి, సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జన జాతర సభకు ప్రజలు భారీగా తరలివచ్చారు.



## కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ బూత్‌స్థాయి కన్వీనర్లు 39 ,40 ,41 బూత్ కేంద్రాలలో తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోపై వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను ఆదరించి చేతు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచారంలో అఫ్జల్, ఎజాజ్ ఖాన్, సలీం, వహీద్, బర్ల సాయిలు, సోహెల్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కోటగిరిలో 'కారు' ప్రచారం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** జహీరాబాద్ పార్లమెంట్ గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ నేతలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏడ్లలో చేసిన అభివృద్ధిని ప్రగతిని ప్రజలకు వివరిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు కోటగిరి మండల కేంద్రంలో 44వ బూత్‌లో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు కోరారు. మహిళలు కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్నారని కోటగిరి బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కోటగిరి మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, బూత్ కమిటీ సభ్యులు ఉదయ్, రాములు, విజయ్, విటల్, రాజు, పోశెట్టి, శ్రీను, మారుతి, లక్ష్మణ్ దినేష్ శ్రీకాంత్, లాలయ్య, సాయిలు, గంగారం, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ఎక్సైజ్ ఎస్ఐ కాళీప్రసాద్ మృతి



**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐ కాళీ ప్రసాద్ నీకు (58) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసాద్ గత మూడు నెలల క్రితం ఎల్లారెడ్డిపేటకు బదిలీపై వచ్చారు. ఎల్లారెడ్డిపేటలో తను అద్దె ఇంటిలో నివాసమై ఉంటున్న ఇంట్లో వికతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కాళీప్రసాద్ మృతికి స్టేషన్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది ప్రగాఢ సంతాపం ప్రకటించారు.



## ఫొటో, వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎండి అజీముద్దీన్

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల ఫొటో వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి సుధగోని సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎండి అజీముద్దీన్, ఉపాధ్యక్షులుగా మారోజు కుబేర స్వామి, చాడ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పెంజర్ల తిరుపతియాదవ్, కోశాధికారిగా నాగుల శ్రీధర్, సహాయ కార్యదర్శిగా ఎం హరీష్, గౌరవ సలహాదారులుగా ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, పాలాజీ శ్రీనివాస్‌చారి, ఎండి ఫక్రుద్దీన్, ఎండి షాదుల్, కార్యవర్గ సభ్యులుగా ఏ రాజు, మారోజు నరసింహచారిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అజీముద్దీన్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి పాటుపడతానన్నారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సూచనలు సలహాలు తీసు కొని ముందుకెళ్తానని తెలిపారు. ఫొటోగ్ర ఫీ, వీడియోగ్రఫీకి సంబంధించినటువంటి ఫొటో ఫ్రేమ్స్, గిఫ్ట్ ఫొటో, ఫ్రేమ్స్ స్టూడియో వాళ్లే తయారు చేస్తారన్నారు. ఈ పనిని జనరల్ స్టోర్ వాళ్లు గానీ, వేరే వ్యాపారస్తులు గానీ చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్బాని ప్రకాష్, సాప సుధాకర్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో జోరుగా బీజేపీ ప్రచారం

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం అక్కపెల్లి దుమాల గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు బండి సంజయ్‌కి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను మోసగించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు దూరం పెట్టారన్నారు. దేశంలోని ప్రజలంతా బీజేపీ, నరేంద్ర మోడీ వైపు ఉన్నాని తెలిపారు. ప్రజల నుంచి అద్భుతంగా స్పందన వస్తుందని తెలిపారు. మరోసారి నరేంద్ర మోడీని ప్రధాన మంత్రిగా చూడాలని గ్రామాలలో ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పార్టీ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కి మీ మద్దతు తెలిపి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మద్దుల బుగ్గారెడ్డి, బంధారపు లక్ష్మారెడ్డి, చందుపట్ల లక్ష్మారెడ్డి, మానుక కుమార్, అరవింద్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, నరేష్‌రెడ్డి, నంది నరేష్, అంజి కృష్ణ, హరి, కిరణ్‌నాయక్, శ్రీశైలం, సంజీవరెడ్డి, ఆంజనేయులు, బాలగౌడ్, వేణు, నాయకులు పాల్గొన్నారు.



## నేను బస్సుయాత్ర ప్రారంభించాక కాంగ్రెస్, బీజేపీ నేతల

# గుండెలు వణుకుతున్నాయ్ : కేసీఆర్

- బీఆర్ఎస్ ఎంపీల గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉందన్న కేసీఆర్
- కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమేనని వ్యాఖ్య
- బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై తనను నిలువరించారన్న కేసీఆర్
- 48 గంటల పాటు తనపై నిషేధం విధించి గొంతు నొక్కారని ఆగ్రహం



**తెలంగాణ ప్రభ, (పెద్దపల్లి) :** తాను బస్సు యాత్రను ప్రారంభించాక కాంగ్రెస్, బీజేపీ నేతల గుండెలు వణుకుతున్నాయని.. వారు వణికిపోతున్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రామగుండంలో నిర్వహించిన రోడ్డుషోలో పాల్గొన్న కేసీఆర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ఎంపీల గెలుపులోనే తెలంగాణ గెలుపు ఉందన్నారు. అరచేతిలో కాంగ్రెస్ వైకుంఠం చూపించిందన్నారు. కేంద్రంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమేనన్నారు. మోదీ పాలనలో మత విద్వేషం, దేశం నాశనం తప్ప మరేమీ లేదని ఆరోపించారు. బీజేపీ హయాంలో రూపాయ విలువ తగ్గుతోందన్నారు. డాలర్ మారకంతో పోలిస్తే రూపాయి విలువ 84 స్థాయికి పడిపోయిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై తనను నిలువరించాలని తనపై 48 గంటల ప్రచార నిషేధం విధించారని ఆరోపించారు. 48 గంటల తర్వాత నిషేధించబడిన తన గొంతు మళ్లీ మాట్లాడుతుందని, తాను ఏం చేశానని గొంతును ఆపేశారాని ప్రశ్నించారు. నా గొంతును ఎందుకు నొక్కేశారు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల పట్ల ఇష్టారీతిన మాట్లాడినందుకు తాను సిరిసిల్లలో కోపంలో ఓ మాట మాట్లాడానని... అందుకే తన గొంతు నొక్కేస్తారా? అని ప్రశ్నించారు. రూ.370 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని అడిగితే నిరోధ్‌లు అమ్ముకోండని కాంగ్రెస్ నేత అన్నారని.. అందుకు తనకు కోపం వచ్చిందన్నారు. రాజకీయాల్లో మతం గురించి మాట్లాడటం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని, కానీ అమిత్ షా తన చేతిలో దేవుడి బొమ్మ పెట్టుకుని మాట్లాడుతుంటే ఈసీకి కనిపించడం లేదన్నారు. ప్రధాని మోదీ హిందూవులు, ముస్లింలంటూ మాట్లాడితే ఈసీకి కనిపించదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు ఏం చేశావని అడిగితే గుడ్లు పీకి గోలీలు ఆడుతాం, పండవెట్టి తొక్కుతామని రేవంత్‌రెడ్డి మాట్లాడితే ఈసీకి కనిపించదన్నారు. చేనేత కార్మికుల పక్షాన మాట్లాడితే తనపై నిషేధం విధించారన్నారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలవాలనేది ప్రజలే నిర్ణయిస్తారన్నారు.




## లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యపై సర్వే

**తెలంగాణ ప్రభ (ఎల్లారెడ్డిపేట) :** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో నెలకొన్న లో ఓల్టేజ్ విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల సెస్ ఏఈ పృథ్వీధర్‌కు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజు యాదవ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సెస్ లైన్‌మెన్ జెట్టి తిరుపతి, లైన్ ఇన్స్పెక్టర్ కారం లక్ష్మి రాజం,హెల్పర్ వెంకటేష్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోచమ్మతల్లి గుడి వద్ద 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ లో సమస్య ఉన్నట్లు గుర్తించిన అధికారులు కొత్త ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు.





# గంగారెడ్డికి ఘన నివాళి

### తృతీయ వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు అన్నదానం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ కాలనీ ప్రాంతానికి చెందిన బలిజ గంగారెడ్డి తృతీయ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని పలువురు నిరుపేదలకు అన్నదానం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతలకు, రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.

గంగారెడ్డి దళితుల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన సింగిల్ విండో వైస్ చైర్మన్‌గా చేసిన సమయంలో రైతులకు ఎంతో సహాయం చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన లేని లోటు తీరనిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మోర్తాడ్ లక్ష్మీనారాయణ, బద్ది సుజాత మురళి, బలిజ పద్మా రాజారెడ్డి, అంబేద్కర్ సంఘ నాయకులు ఉయ్యాల నర్సయ్య, పసుల కృష్ణ ప్రసాద్, ఉయ్యాల శోభన్, గోరుమంతుల సత్తయ్య, సామల వేణుగోపాల్, గడేల రాజు, బలిజ శివప్రసాద్, బుల్లె గంగాధర్, బలిజ రాజశేఖర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లోకి వేముల మాణిక్యం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త వేముల మాణిక్యం కుటుంబ సభ్యులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేముల మాణిక్యం కూతురు చింత రూపలత మాణిక్యం తదితరులకు జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కోరుట్ల పట్టణ మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, ఏలేటీ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఆకుల లింగారెడ్డి, డాక్టర్ జేఎన్ వెంకట్, ఎంబేరి నాగ భూషణం, ఆడెపు మధు పాల్గొన్నారు.




## జోరుగా కాంగ్రెస్ ప్రచారం

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలించింది కాంగ్రెస్ పార్టీనేనని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలోని కల్లూరు, సర్పరాజ్‌పల్లె గ్రామాల్లోని ఉపాధి హామీ కూలీలతో శుక్రవారం సమావేశమైన కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు పేద ప్రజల మంచి గురించే ఆలోచన చేస్తుందన్నారు. దేశంలో ఆకలి చావులు ఉండకూడదనే ఉద్దేశంతో ఉపాధిహామీ పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. మరిన్ని ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే లోక్ సభ నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డిని సంపూర్ణ మెజారిటీతో గెలిపించాల్సిందిగా కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల మండల అధ్యక్షుడు కొంతం రాజం, రమేష్, గంగాధర్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

